క్లుప్తంగా

అనారోగ్యంతో కాకుమాను సర్పంచి మృతి





శివకుమారి(ఫైల్)

కాకుమాను: అనారోగ్యంతో కాకుమాను సర్పంచి పసుపులేటి శివకుమారి(62) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. 2021లో పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థిగా పోటీ చేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె భౌతిక కాయాన్ని పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యులు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, అసదుల్లా, పార్టీ మండల కన్వీనర్ కొమ్మాలపాటి రవి కుమార్, పార్టీ వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, గేరా పున్నారావు, కానుగుల పరమేశ్వరరావు ఉన్నారు.

బలసానితో మర్యాద పూర్వక కలయిక



గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడుగా నియమితులైన కొలకలూరి కోటేశ్వరరావు శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాను కప్పి సన్మానించారు. బలసాని మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో గ్యార్మీ ప్రార్థనలు

పొన్నూరు: పవిత్ర గ్యార్మీ మాసం పురస్కరించుకుని పట్టణంలోని మార్కెట్ సమీపంలోని పీరానే పీర్ గౌసే ఆజం దస్తగీర్ జెండా చెట్టు (నిషాన్) వద్ద భక్తి శ్రద్ధలతో గ్యార్మీ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షీరాభిషేకం, గంధం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమాన్ని నిర్వాహకులు సయ్యద్ జైనులాబ్దిన్ పర్యవేక్షించారు.

వడ్లమూడిలో..

వడ్లమూడి(చేబ్రోలు): గ్రామంలో శనివారం రాత్రి గార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి హాజరయ్యారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



ఫిరంగిపురం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ శివరామకృష్ణ తెలిపారు. స్థానిక పెట్రోలు బంకు సమీపంలో శనివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఇన్స్యూరెన్స్, ఇతర పత్రాలు పరిశీలించారు. నిబంధనలు పాటించకపోతే జరిమానా విధిస్తామని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో ప్రమాదాలు కొని తెచ్చుకోవడమే అవుతుందని హెచ్చరించారు. తనిఖీలలో ఏఎస్ఐ పి.జాన్‌ఖాన్, రైటర్ దాసు పాల్గొన్నారు.

మురుగు నీటితో ప్రయాణికులకు అవస్థలు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని కొలనుకొండ- వడ్డేశ్వరం ప్రధాన రహదారిపై నిత్యం మురుగు నీరు ప్రవహిస్తుండడంతో ప్రయాణికులతో పాటు స్థానికులు అవస్థలు పడుతున్నారు. కొలనుకొండ రోడ్డు నుంచి మురుగు నీరు నివాసాల మధ్య నుంచి 500 మీటర్లు ప్రవహిస్తూ చెరువులో కలుస్తోంది. గత రెండు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉంది. కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి ప్రధాన రహదారి వెంబడి డ్రెయిన్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇక ‘స్వర్గధామం’

- దాతల సహకారంతో శ్మశాన వాటికలో సమకూరిన ప్రధాన సౌకర్యాలు
- రూ.16.5 లక్షలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టిన దాతలు, గ్రామస్తులు
- నేడు గ్రామస్తుల మధ్య ప్రారంభోత్సవాలు



సిద్ధమైన ‘స్వర్గారోహణం’ దహనసంస్కారాల మండపం



కాటికాపరి విగ్రహం

ప్రత్తిపాడు: వానాకాలం అయితే దహన సంస్కారాలు అంటేనే కంగారు పడాల్సిన పరిస్థితి. ఎప్పుడు వాన కురుస్తుందో.. ఎక్కడ కాలే కట్టె మధ్యలోనే ఆరిపోతుందో.. అనే టెన్షన్.. తీరా కాలిన తరువాత అస్తికలను ఎక్కడ భద్రపరచాలో తెలియక.. ఇంటికి తీసుకువెళ్లలేక.. శ్మశానంలోనే గుంత తీసి అక్కడ పాతిపెట్టి వెళ్లాల్సిన దుస్థితి. ఒక పక్క పార్థివ దేహం అగ్నికి ఆహుతి అవుతుంటే ‘ఆ నలుగురు’ నిలువ నీడ లేక అరుగులపైన.. చెట్ల కింద నిరీక్షించాల్సిన పరిస్థితి.. కానీ ఇవన్నీ ఇక గతం. ఏళ్ల తరబడి.. కాదు కాదు దశాబ్దాలుగా వేల గడప ఉన్న ప్రత్తిపాడులో ప్రజలు పడుతున్న శ్మశాన కష్టాలకు దాదాపుగా తెర పడినట్లే. హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడంతో శ్మశాన వాటికలో అనేక వసతులు సమకూరాయి. వీటిని ఆదివారం దాతలు, గ్రామస్తుల సమక్షంలో ప్రారంభించనున్నారు.



రూ.7 లక్షలతో నిర్మించిన ‘శివైక్యం’ విశ్రాంతి భవనం

సహృదయంతో ముందుకొచ్చిన దాతలు..

- దాతలు సహృదయంతో ముందుకు రాకవడంతో దాదాపుగా రూ. 16.5 లక్షల రూపాయలతో పలు నిర్మాణాలు చేపట్టారు.
- ‘స్వర్గారోహణం’ పేరుతో దహన సంస్కారాల మండపాన్ని గుజ్జుల శ్రీనివాసులరెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గురుగూరి ప్రతిభ, పోశం ప్రగతి రెడ్డి(సురక్ష హాస్పిటల్, గుంటూరు) రూ.9 లక్షలతో నిర్మించారు.
- ‘శివైక్యం’ పేరుతో విశ్రాంతి భవనాన్ని గ్రామానికి చెందిన బాపతు సాంబశివారెడ్డి, రజిని దంపతులు రూ.7.5 లక్షల వ్యయంతో నిర్మించారు.
- అలానే మరికొందరు దాతల చేయూతతో అస్తికల లాకర్, మార్చురీ బాక్స్, స్టీల్ పాడే సమకూర్చారు.
- అదేవిధంగా ప్రత్తిపాడుకు చెందిన ఉల్లంగుల విజయ్ కాటి కాపరి విగ్రహాన్ని రూ.50 వేల వ్యయంతో ఏర్పాటు చేయించారు.
- గతంలోనూ గ్రామానికి చెందిన వెన్నపూస రోశిరెడ్డి, సీత దంపతులు వారి కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం శ్మశాన వాటికలో గదిని నిర్మించారు.

దాతల దాతృత్వం ప్రశంసనీయం



నూతన తరగతి గదులను ప్రారంభిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అదనపు గదులను శనివారం ప్రారంభించారు. స్థల దాతలు శ్యామల గోపాలరెడ్డి, రామసుశీల దంపతుల జ్ఞాపకార్థం కుమారులు శ్రీనివాసరెడ్డి, రఘునాథరెడ్డి కుమార్తెలు మేకా శివనాగేంద్రం, మువ్వా నాగమల్లేశ్వరి, బట్టగిరి ధనలక్ష్మి, అల్లుడు మువ్వా ఈశ్వరరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో దాదాపు పన్నెండు లక్షల రూపాయలతో నిర్మించారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌గా అప్ గ్రేడ్ అనంతరం పాఠశాలలో గదుల కొరత, విద్యార్థుల అసౌకర్యాన్ని గుర్తించి మెగా పేరెంట్స్‌డే కార్యక్రమంలో విద్యాకమిటీ, ఉపాధ్యాయుల విన్నపాలకు స్పందించిన దాతలు ఈశ్వరరెడ్డి శ్రమించి రెండు నెలల్లో నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చి ప్రభుత్వానికి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రిదేవి, రిటైర్డ్ వ్యాయామ అధ్యాపకుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ దాతలు స్పందించి నిర్మాణం చేపట్టడం హర్షణీయమని చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటరు శ్యామల వెంకటరమణాదేవి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చావా సరోజిని, ఉపాధ్యాయులు రామచంద్రరావు, హనుమంతరావు, శ్రీనివాసరావు గ్రామ పెద్దలు మాజీ సర్పంచి బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కుర్రా పుల్లారెడ్డి పాల్గొన్నారు.

పండ్లు, కూరగాయల మొక్కలు నాటాలి

నాగులపాడు(కాకుమాను): పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో పండ్లు, కూరగాయల మొక్కలు నాటుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెన్నడీ సూచించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నాటి సంరక్షించిన పండ్లు, కూరగాయల మొక్కలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో నాటిన కూరగాయలతో ప్రతి రోజు విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి వినియోగించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మౌనిక పాల్గొన్నారు.

పెదనందిపాడులో నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రత్తిపాడు: రోటరీ క్లబ్ పెదనందిపాడు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు చిన్నం శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎంపీపీలు నర్రా బాలకృష్ణ, ముద్దన నగరాజకుమారి సౌజన్యంతో స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కాటూరి మెడికల్ కళాశాల, హాస్పిటల్ సహకారం వైద్యసేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, గుండె, ఎముకలు, కీళ్లు, ఈఎన్‌టీ, చర్మ వ్యాధులు, పల్మనాలజీ, ఆప్తమాలజీ, స్త్రీ ప్రసూతి వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. అదే విధంగా కంటి పరీక్ష, కంటి శుక్లాలకు పొర ఆపరేషన్లను ఉచితంగా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిబిరానికి హాజరయ్యే వారు తమ ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని శ్రీనివాసరావు సూచించారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

పొన్నూరు: కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని, అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవడంలో విఫలమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి యందేటి వెంకట సుబ్బయ్య విమర్శించారు. వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆదేశాల మేరకు మండలంలోని వల్లభరావుపాలెంలో ఈ నెల 2వ తేదీన షార్ట్ సర్క్యూట్‌తో నష్టపోయిన బాధిత యానాది కుటుంబాలను పరామర్శించి, నిత్యావసరాలు అందజేశారు. ప్రభుత్వం స్పందించి ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాపట్ల నాగప్రసాద్, ఎస్టీ సెల్ నాయకులు కొమరగిరి సూరిబాబు, చౌటూరి రమేష్, కుంభ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ట్రంప్ విధానాలను భారతీయులంతా వ్యతిరేకించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

తాడేపల్లి రూరల్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలను భారత పౌరులందరూ వ్యతిరేకించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ పిలుపునిచ్చారు. ఉండవల్లి సెంటర్‌లోని సీపీఎం కార్యాలయంలో శనివారం కుంభ ఆంజనేయులు అధ్యక్షతన పార్టీ రాజధాని డివిజన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ అదనపు సుంకాలు పెంచి భారత్‌ను అదుపు, ఆజ్ఞల్లో ఉంచుకోవాలని ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలపై కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం సరైనది కాదని పేర్కొన్నారు. సామ్రాజ్యవాద దేశమైన అమెరికా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, దాన్నుంచి బయట పడేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలపై అదనపు సుంకాలు విధిస్తోందని వివరించారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి చూపించడం లేదని విమర్శించారు. పేదలకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఎం నేతలు భాగ్యరాజు, నవీన్ ప్రకాష్, వల్లభాపురం వెంకటేశ్వరరావు, పేరం బాబూరావు, చెంచయ్య, రామకృష్ణ, జానీ, పార్వతి, షేక్ ఖాదర్ బాబా పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభం



పొన్నూరు: పురపాలక సంఘ పరిధిలో శనివారం ఆటో డ్రైవర్ల సేవలో పథకం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 1694 ఆటో డ్రైవర్లకు ఒక్కొకరికి రూ.15 వేలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు, పొన్నూరు స్పెషల్ ఆఫీసర్ టి.వి.విజయలక్ష్మి, తెనాలి బ్రేక్ ఇన్‌స్పెక్టర్ జి. అమృత రాణి పాల్గొన్నారు.

కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చాలి



శిబిరంలో కార్మికులకు మద్దతు తెలుపుతున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. కార్మికుల దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టు తీర్పుల ప్రకారం న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం మాత్రమే వారు అడుగుతున్నారని, ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరారు. ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, గురవయ్య, ఆశీర్వాదం, కార్మికులు పిచ్చయ్య, నాగేశ్వరరావు, సాంబశివరావు, ఇశ్రాయిల్, రమాదేవి, దుర్గాభవాని, శివకుమారి, సారమ్మ, ఇమాంబి, కాసమ్మ, రిబ్కా, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకురాలు మాణిక్యమ్మ మృతి

దుగ్గిరాల: సీపీఎం సీనియర్ నాయకురాలు గొట్టిముక్కల మాణిక్యమ్మ (90)శనివారం దుగ్గిరాల మండలం చిలువూరులో మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని సీపీఎం మండల కార్మిక నాయకులు జెట్టి బాలరాజు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కె. ఉమామహేశ్వరరావు, జయపాల్, కె.భిక్షాలు, వి.మురళి నివాళులర్పించారు.

12న ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈనెల 12న జాతీయస్థాయిలో ఉపాధ్యాయ రత్న, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం చేసేందుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యా, విజ్ఞాన బోధనతో పాటు సాహిత్య, సాంస్కృతిక, కళా, క్రీడా రంగాల్లో అత్యుత్తమ శిక్షణ ద్వారా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న అధ్యాపకులు, ఉపాధ్యాయుల ప్రతిభ, సేవానిరతిని వెలుగులోకి తెచ్చి, వారిని మరింతగా ప్రోత్సహించేందుకు హైదరాబాద్‌లో పురస్కారాలను ప్రదానం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు విద్యాసంస్థల్లోని ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యాబోధనతో పాటు కళ, క్రీడా, సాంస్కృతిక, యోగా అంశాల్లో వారి అర్హతలు, అనుభవానికి సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్, పేపర్ క్లిప్పింగ్స్, నాలుగు పాస్‌పోర్ట్ ఫోటోలతో దరఖాస్తును ఈనెల 10లోపు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబరు 1-20-164, గోకుల్ నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపాలని సూచించారు.

డివైడర్‌ను ఢీకొన్న సిమెంట్ లోడు లారీ



ఫిరంగిపురం: సిమెంట్ లోడు లారీ ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొన్న సంఘటన మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచర్ల నుంచి సిమెంట్ లోడుతో మంగళగిరి వెళుతున్న లారీ ఫిరంగిపురంలోని పంచాయతీ కార్యాలయం వద్దకు రాగానే రహదారికి మధ్యలోఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో లారీ ముందు భాగం బాగా దెబ్బతింది. డ్రైవర్ శ్రీనివాసరావుకు ఎటువంటి గాయాలు కాలేదు. కాగా డివైడర్ల వద్ద ప్రమాద సూచికలు తెలిపే స్టిక్కర్లు లేకపోవడం, కాంతి తక్కువగా ఉండటంతో కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయని డ్రైవర్లు ఆరోపిస్తున్నారు.

వైభవంగా కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవం



వెనిగండ్ల శ్రీవేణుగోపాలస్వామి ఆలయం వద్ద కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవంలో పాల్గొన్న అంబటి మురళీకృష్ణ



పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవంలో పాల్గొన్న మురళీకృష్ణ..

పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్లలో వేణుగోపాలస్వామి ఆలయం వద్ద, పంచాయతీ కార్యాలయం సమీపంలోనూ కనకదుర్గ అమ్మవారిని ప్రత్యేక పందిళ్లలో అలంకరించి పూజలు చేశారు. దసరా వేడుకల్లో భాగంగా శుక్రవారం గ్రామంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో చివరిరోజు శనివారం అమ్మవారిని ట్రాక్టర్‌పై ప్రత్యేకంగా అలంకరించి కనులపండువగా గ్రామోత్సవం చేశారు. ఈ గ్రామోత్సవ వేడుకల్లో వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పొన్నూరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరారు. శక్తి స్వరూపిణి అయిన కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు పొన్నూరు నియోజకవర్గ ప్రజలందరికీ మెండుగా ఉండాలని పూజలు చేశారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ శక్తి ఆరాధనకు ప్రాధాన్యమిచ్చే ఈ నవరాత్రి సందర్భంగా అమ్మవారి దివ్య మంగళ రూపాన్ని తొమ్మిది అవతారాల్లో దర్శించుకున్నామన్నారు. రాక్షస సంహారంతో లోకానికి శాంతి సౌభాగ్యాలు తెచ్చిన ఆ తల్లి చల్లని చూపు నియోజకవర్గంలో నీ ప్రజలపై మెండుగా ఉండాలని కోరారు.

ఘనంగా కొత్తరెడ్డిపాలెంలో దుర్గామాత గ్రామోత్సవం



చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో కనకదుర్గమ్మ అమ్మవారి గ్రామోత్సవం

చేబ్రోలు: మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో కనకదుర్గమ్మ అమ్మవారి గ్రామోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి స్థానిక భక్త బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రాక్టర్‌పై అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో ఊరేగింపుగా గ్రామోత్సవం నిర్వహించి అనంతరం నిమజ్జనానికి తరలించారు. అమ్మవారి విగ్రహం వద్ద 22 కిలోల లడ్డూ ప్రసాదాన్ని నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యే పూజలు నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఉడుముల కృష్ణారెడ్డి కుమారులు కోటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డిలు లక్షా పది వేలకు వేల పాటలో దక్కించుకున్నారు.

ప్రఖ్యాత పర్యావరణ వేత్త జేన్ గూడాల్‌కి ఘన నివాళి



ప్రఖ్యాత పర్యావరణ వేత్త జేన్ గూడాల్‌కు నివాళులర్పిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ సింహాచలం

ఏఎన్‌యూ(పెదకాకాని): ప్రఖ్యాత పర్యావరణవేత్త ఎథోలాజిస్ట్, ప్రిమటాలజిస్ట్, ఆంత్రోపాలజిస్ట్, జీవహక్కుల పోరాట యోధురాలు జేన్ గుడాల్ చేసిన పరిశోధనలను విద్యార్థులు పరిశోధకులు ఆదర్శంగా తీసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం కోరారు. వర్సిటీలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన గుడాల్ చిత్రపటానికి పూలమాలలు వేసిన అధికారులు ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం మాట్లాడుతూ టాంజానియాలోని గోంబే స్ట్రీమ్ నేషనల్ పార్క్‌లో చింపాంజీల మీద ఆమె విస్తృతంగా పరిశోధనలు చేశారన్నారు. జీవ సంక్షేమం, పర్యావరణ పరిరక్షణపై ఆమె చేసిన కృషిని యువ పరిశోధకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. పర్యావరణ విభాగాధిపతి ఆచార్య స్వామి మాట్లాడుతూ జీవుల మధ్య సామరస్యాన్ని కాపాడడానికి జేన్ గుడాల్ చేసిన కృషి అమోఘమైందన్నారు. బీఓఎస్ చైర్మన్ డాక్టర్ పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ మానవుడు చింపాంజీల మధ్య అంతఃసంబంధాలను పరిశోధించడం ద్వారా గుడాల్ పర్యావరణ పరిరక్షణకు జీవుల మధ్య సామరస్యం ఎంతో కీలకమని ధ్రువీకరించారన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చేబ్రోలు లింగరాజు, వర్సిటీ ఎలక్ట్రికల్ డీఈఈ ఎన్.వెంకటేశ్వర్లు, బాలుర వసతి గృహాల డెప్యూటీ వార్డెన్లు డాక్టర్ ఎస్.బాబు, డాక్టర్ కె.శశిధర్, పరిశోధకులు సతీష్, కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

పొన్నూరు: నిడుబ్రోలులో చేనేత సహకార సంఘంలో జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సదస్సులో ముఖ్య అతిథులుగా చేనేత, జౌళీ శాఖ అధికారులు రాజ వర్ధన్, శ్రీధర్ బాబు పాల్గొని ప్రజలు, వినియోగదారులకు సూపర్ జీఎస్టీ, సేవింగ్‌పై వివరించారు. వాణిజ్య పన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ వై.వి.కృష్ణవేణి మాట్లాడుతూ జీఎస్టీ 2.0 కొత్త లక్ష్యాలు, ప్రజలకు లభించే ప్రయోజనాలు, సూపర్ జీఎస్టీ ద్వారా కొనుగోలుదారులకు కలిగే లాభాలు వివరించారు. డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎల్.రాధికా మాట్లాడుతూ సూపర్ సేవింగ్స్ ద్వారా వస్తువులపై తగ్గింపు ధరలు, కొనుగోలు విధానాలను తెలియజేశారు. కార్యక్రమంలోఎంపీడీవో గుమ్మ చంద్ర శేఖర్ రావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

- రూ.6 లక్షల విలువైన ఆపరేషన్ ఉచితం
- సీటీఎస్ వైద్యులకు అభినందనలు



మాట్లాడుతున్న డాక్టర్ యశస్వి రమణ, చిత్రంలో ఆపరేషన్ చేయించుకున్న మల్లికార్జున

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో కార్డియో థొరాసిక్ సర్జరీ వైద్యులు అత్యంత అరుదైన శస్త్రచికిత్స చేసి, చేతికి పునర్జీవనం కల్పించారు. శనివారం ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ఆపరేషన్ వివరాలు మీడియాకు వివరించారు. పెదపలకలూరు గ్రామానికి చెందిన మల్లికార్జున అక్టోబరు ఒకటి తేదీన పనిచేస్తున్న సమయంలో చెయ్యి మిషన్‌లో పడి తీవ్ర గాయమైంది. చేతి నరాలు తెగిపోయాయి.

తీవ్ర గాయాలతో జీజీహెచ్‌కు వచ్చిన మల్లికార్జునకు కార్డియో థొరాసిక్ వైద్యులు వెంటనే అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి చేతికి పునర్జీవం కల్పించారు. సుమారు రూ.6 లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఉచితంగా చేసినట్లు కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణమూర్తి తెలిపారు. తమ విభాగంలో సాధారణ శస్త్రచికిత్సలతోపాటు, అత్యవసర ఆపరేషన్లు చేస్తున్నామని, ప్రజలు వైద్య సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. రోగికి తీవ్రగాయంతో అత్యవసర ఆపరేషన్ చేసి చేతిని కోల్పోకుండా చేసిన సీటీవీఎస్ వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అభినందించారు. ఆపరేషన్ ప్రక్రియలో పాల్గొన్న డాక్టర్ కుప్పుస్వామి, డాక్టర్ యోగి, మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ కె.పోలయ్య బృందానికి అభినందనలు తెలిపారు.